www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023
5
పశ్చిమ గోదావరి

నేడు సిపిఎం, సిపిఐ బహిరంగ సభ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 14న శుక్రవారం స్థానిక ప్రకాశం చౌక్‌లో తలపెట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు బి.వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14 నుండి 30 వరకు దేశవ్యాప్తంగా మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన ప్రచార భేరీలో భాగంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు సిపిఐ రాష్ట్ర నాయకులు రావుల రవీంద్రనాథ్, సిపిఎం రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరారు.

అమృత్.. ఆలస్యం..!

- ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని ప్రాజెక్టు నిర్మాణ పనులు
- నిధుల మంజూరుపై నమ్మకం లేక ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పరిపాలనా అనుమతుల కోసం ఎదురుచూపులు
- తాడేపల్లిగూడెంలో బ్రేక్.. ఆకివీడులో ముందుకు సాగిన పరిస్థితి
- అమృత్ పథకం నిర్వహణలో వైసిపి ప్రభుత్వం నీలి నీడలు

ప్రజాశక్తి - భీమవరం

పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమృత్ పథకాన్ని చేపట్టింది. జిల్లాలో ఈ పథకం పడకేసింది. ఒకటి, రెండు పట్టణాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో పనులకు అసలు అనుమతులే లభించలేదు. ఈ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బిజెపి నేతలు విమర్శిస్తున్నారు. మొదటి విడతలో మంజూరైన రూ.200 కోట్లు విలువైన పనులతోపాటు రెండో విడతలో అమృత్ 2.0లో మంజూరైన సుమారు రూ.156 కోట్లు విలువైన పనులు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. ఈ నేపథ్యంలో పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లో తాగునీరు, డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్రం ఈ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చింది. అయితే వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఈ పనులు ముందుకు సాగకపోవడానికి కారణమని ఆరోపణలు విన్పిస్తున్నాయి. తొలి విడతలో జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణాలు చోటుదక్కించుకున్నాయి. ఈ రెండు పట్టణాల్లోనూ దాదాపు రూ.200 కోట్లతో పనులు చేపట్టేందుకు కేంద్రం అనుమతిచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితేనే కేంద్రం అనుమతులు మంజూరు చేస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించడంలోనే జాప్యం చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణాలకు కాలంలో పరిపాలనా అనుమతులు లభించని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం అమలులోకి వచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలో భీమవరం పట్టణానికి రూ.51.37 కోట్లు, తాడేపల్లిగూడేనికి రూ.48.80 కోట్లు, తణుకుకు రూ.8.38 కోట్లు, నరసాపురానికి రూ.21 కోట్లు, ఆకివీడుకు రూ.26.50 కోట్లు రెండో దశలో కేటాయించారు. దీని పట్ల కూడా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. జిల్లాలోని ప్రతి పట్టణాన్నీ అమృత్ 2.0 పథకం పరిధిలోకి తీసుకొచ్చారు. తణుకు, పాలకొల్లు, నరసాపురం మున్సిపాల్టీలతోపాటు ఆకివీడు నగర పంచాయతీకి చోటు లభించింది. అమృత్ 2.0లో ఆకివీడు నగర పంచాయతీలోనే తాగునీటి వసతుల కల్పనకు రూ.5.32 కోట్లు విలువైన పనులకు పరిపాలనా అనుమతులు లభించాయి. ఇతర పట్టణాల్లో ప్రతిపాదనలు పంపిన అనుమతులు లభించలేదు. ఈ నేపథ్యంలో ఈ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే మొదటి దశ పనులే పూర్తికాని పరిస్థితుల్లో రెండోదశ పనులు ప్రశ్నార్థకంగా మారాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

అమృత్ పథకంలో కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మరో 30 శాతం, సంబంధిత స్థానిక సంస్థలు 20 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంది. ప్రాజెక్ట్ వ్యయంలో జిఎస్‌టిని స్థానిక సంస్థలే భరించాలి. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చే నిధులపైనే ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమృత్ బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతున్న పరిస్థితి ఉంది. దీనివల్ల కాంట్రాక్టర్లు సకాలంలో పనులు నిర్వహించలేని దుస్థితి ఏర్పడింది. మున్సిపాల్టీలు తమ సొంత నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు బిల్లులు సక్రమంగా మంజూరు కాని పరిస్థితి ఉంది. సిఎఫ్‌ఎంఎస్ ఫ్రీజింగ్ అమలవుతోంది. నెలలు తరబడి బిల్లుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఇదే అమృత్ పథకానికి అవరోధంగా మారింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు ఎవరూ ఈ పనులు చేసేందుకు ముందుకురావడం లేదు.

అపెక్స్ కమిటీ ఆమోదం

మొదటి విడతలో నిధులు మంజూరైన ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో ముందుకు కదల్లేదు. దీంతో మొదటి విడతలో భీమవరం, తాడేపల్లిగూడెంల్లో మంజూరైన పనులను అమృత్ 2.0లో విలీనం చేశారు. ఈ నేపథ్యంలోనే నరసాపురం, తణుకు, ఆకివీడు మున్సిపాల్టీలను కొత్తగా అమృత్ 2.0 పరిధిలోకి తీసుకొచ్చి నిధులు కేటాయించారు. దీనికి ఉన్నతస్థాయి (అపెక్స్) కమిటీ ఆమోదముద్ర కూడా వేసింది. ప్రస్తుతం పరిపాలనా అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. తర్వాత టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంటుంది. అమృత్ 2.0లోనూ తాగునీరు, డ్రయినేజీ వ్యవస్థ కోసమే ప్రధానంగా నిధులు కేటాయిస్తున్నా పనులు ముందుకు సాగే పరిస్థితి కన్పించట్లేదు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. పట్టణ వాసులకు తప్పని తిప్పలు

అమృత్ పథకంలో తాడేపల్లిగూడెం పట్టణానికి అధిక నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత స్థానంలో భీమవరం ఉంది. తాడేపల్లిగూడెంలో మంజూరైన ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. టిడిపి ప్రభుత్వ హయాంలోనే టెండర్లు ఖరారైన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ప్రాజెక్ట్ ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఈ పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే భీమవరం, … నరసాపురం ప్రాంతాల్లో ట్యాంకర్ల నీటి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక డ్రయినేజీ వ్యవస్థ గురించి చెప్పనవసరం లేదు. చిన్నపాటి వర్షానికి మోకాళ్లలోతు నీరు చేరి పట్టణాలు చెరువులను తలపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణాలోపం వల్ల పట్టణ వాసుల కష్టాలు మాత్రం గట్టెక్కడం లేదు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

నిర్ణీత సమయంలో ఓటర్ల జాబితా

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు నిర్ణీత గడువులోగా సిద్ధం చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో క్లయిమ్స్ పరిష్కారం, వెరిఫికేషన్, ఫామ్-6బి, డుప్లికేట్ ఓటర్ల తొలగింపు, రాండమ్ తనిఖీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొమ్మిది అంశాల అజెండాలో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధత, ఓటర్ల జాబితా, బిఎల్ఓ రిజిస్టర్, రాబోయే 2024 సాధారణ ఎన్నికలకు ముందస్తు కార్యాచరణ, రాజకీయ పార్టీలు సమన్వయ సమావేశం, తదితర అంశాలపై సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం చేయడంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న మోడీ ప్రభుత్వం

కోమట్లపాలెంలో ప్రచార భేరి ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

'తెల్ల దొరలను తరిమికొట్టి పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం హరించడం దారుణమని, ఇది అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. గురువారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాజకీయ ప్రచార భేరి కార్యక్రమాన్ని కోమట్లపాలెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి స్థానిక పెద్దలు పిట్టా బాబురావు, సిపిఎం మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ 'బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని రక్షించుకుందాం' అంటూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి ప్రారంభించినట్లు చెప్పారు. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రజలపై మోయలేని భారాలను వేస్తూ కార్పొరేట్లకు వరాల జల్లు కురిపిస్తున్నారని విమర్శించారు. 75 సంవత్సరాల క్రితం ఎందరో త్యాగధనుల స్ఫూర్తితో రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. మోడీ విధానాలను నిరసిస్తూ జరిగే కార్యక్రమాలకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నరాలశెట్టి రామకృష్ణ, ఎం.పెంటారావు, ఎస్.సంజీవరావు, జి.శ్రీను, జి.రాఘవ, ఎం.సాధు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్వాడీలు ప్రభుత్వం నిర్దేశించిన పని వేళల్లో మాత్రమే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను మధ్యాహ్నం వరకు నడపాలని, వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు మాత్రం సాయంత్రం మూడు గంటల వరకు సెంటర్లో ఉండాలని అధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. సర్క్యులర్లో మూడు గంటల వరకు ఉండాలని ఎక్కడ తెలపలేదన్నారు. చాలాచోట్ల చిన్నచిన్న గదుల్లో అంగన్వాడీ కేంద్రాలను నడుపుతున్నారని, కరెంటు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం సిడిపిఒ డి.ఊర్మిళకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మేడిది స్వర్ణలత వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వాకపల్లి ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ క్రమంలో స్థానిక మైత్రి సిటీ స్కానింగ్, డయాగ్నొస్టిక్ సెంటర్ యాజమాన్యం స్కానింగ్ సెంటర్ రెన్యూవల్ ధృవ పత్రాలు సమర్పించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. వాటిలో రెండు స్కానింగ్ మిషన్లు సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మానిటరింగ్ కన్సల్టెంట్ వడ్డి సత్యరవి, డిప్యూటీ డేమో పి.అనంత లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృపరాజు ఉన్నారు.

యల్లమిల్లి కుటుంబం ఔదార్యం గొప్పది

ఎంఎస్‌బివికె ఛైర్మన్ బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కీ.శే యల్లమిల్లి నర్సింహమూర్తి కుటుంబ సభ్యుల ఔదార్యం చాలా గొప్పదని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బి.బలరాం అన్నారు. మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో యల్లమిల్లి నర్సింహమూర్తి కుటుంబ సభ్యులు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రానికి రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ నర్సింహమూర్తి పాలకోడేరు మండలం వేంద్ర గ్రామానికి చెందినవారన్నారు. ఉపాధ్యాయునిగా, కళాకారునిగా, దర్శకునిగా మండలంలో అందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. ఇటీవల ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన సతీమణి సత్యవతి, వారి కుమారులు అచ్యుత సూర్య సుబ్రహ్మణ్యం దంపతులు, సూర్యనారాయణ మూర్తి దంపతులు, సత్యనారాయణ దంపతులు, శ్రీనివాసరావు దంపతులు, కుమార్తె వెంకటలక్ష్మి అల్లుడు రాఘవులు, మనుమలు, మనుమరాళ్లు అందజేసిన విరాళానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కరోనా సమయంలో కరోనా ఐసోలేషన్ కేంద్రాన్ని 70 రోజులపాటు దాతలు, వైద్యుల సహకారంతో నిర్వహించామన్నారు. వంద మందికి చికిత్స అందించామన్నారు. ఎస్ఎల్‌జి హాస్పిటల్స్, వసుధ ఫౌండేషన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వారి సహకారంతో సుందరయ్య భవనంలో రెగ్యులర్ క్లినిక్ ఏడాది కాలంగా విజయవంతంగా నడుస్తోందన్నారు. తక్కువ ధరకే జనరిక్ మందులు కూడా అందజేస్తున్నామన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు కూడా తక్కువకే అందిస్తున్నామన్నారు. రెండు నెలలకోసారి విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో బిపి, సుగర్, ఫిట్స్, పక్షవాతానికి చెందిన క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఆఖరి శనివారం చిన్నపిల్లల గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా అందజేసున్నామన్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఆయన కతజ్ఞతలు తెలిపారు. యల్లమెల్లి నరసింహమూర్తి కుటుంబం అందజేసిన విరాళాన్ని భవిష్యత్‌లో జరిగే సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు. అనంతరం వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ నర్సింహమూర్తి మరణించడం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటన్నారు. పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు, చిన్నపిల్లలకు అవసరమైన ప్రత్యేక వైద్య కార్యక్రమాలు ఈ సేవా కేంద్రం నిర్వహిస్తోందన్నారు. త్వరలో తీసుకురాబోయే బాలభాషిణి పుస్తకంలో యల్లమెల్లి నరసింహమూర్తి జీవిత వివరాలు, ఆశయాలను అందరికీ తెలిసేలా ముద్రిస్తామన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ యల్లమెల్లి నర్సింహమూర్తి కుటుంబ సభ్యులు విజ్ఞాన కేంద్రానికి విరాళం అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో యల్లమెల్లి నర్సింహమూర్తి కుమారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న యల్లమిల్లి కుటుంబ సభ్యులు

విశాఖ ఉక్కు కోసం అన్ని పార్టీలూ కేంద్రంతో పోరాడాలి

పివిఎస్.గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ ఐక్యంగా పోరాడాలని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణంరాజు సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై టిడిపి, వైసిపి, జనసేన ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పేర్కొన్నారు. పెట్టుబడి సహాయం కింద రూ.ఐదువేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విశాఖ ఉక్కు యాజమాన్యం కోరగా కేటాయించకుండా పరిశ్రమ నష్టాలతో నడుస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలపైన కక్షపూరిత చర్యలకు పాల్పడుతుంటే రాష్ట్రంలోని సిఎం జగన్, మాజీ సిఎం చంద్రబాబు మోడీ అడుగులకు మడుగులొత్తుతున్నారని గోపాలకృష్ణంరాజు విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండటంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించి కేంద్ర ప్రభుత్వంపై విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం పోరాడాలని కోరారు.

జిల్లా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ పేరు గొప్పగాను, వైద్యం అంతంతమాత్రంగాను ఉందని విమర్శించారు. ఆసుపత్రిలో ముగ్గురు మత్తు డాక్టర్లు ఉండాల్సి ఉండగా నేడు ఒక్కరే డిప్యూటేషన్ ఉన్నారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రీస్ట్రక్చర్ పేరుతో జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సంఖ్యను పెంచాల్సింది పోయి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నిర్వహించిన సర్వేలో వచ్చిన అనేక సమస్యలను అధికారులు, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్ పేషెంట్స్ పెద్ద సంఖ్యలో వస్తున్నప్పటికీ వైద్య సేవలు అందించడంలో యంత్రాగం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, పి.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

గొరగనమూడిలో ఉద్రిక్తత

సంకెళ్ల రాంబాబు, దుర్గను అరెస్ట్ చేయాలని భారీ ర్యాలీ - భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - పాలకోడేరు

ఒక ఇంటి స్థలం విషయంలో ఏర్పడిన వివాదం నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రతిష్ఠ, గ్రామస్తుల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లే విధంగా పెట్టిన పోస్టుల కారణంగా ప్రశాంతతకు నిలయమైన గొరగనమూడిలో గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గొరగనమూడిలో వాలంటీర్‌గా పని చేస్తున్న పైడిపాల దుర్గ గ్రామంలో ప్రభుత్వ పట్టా భూమిని కొనుగోలు చేసి ఇంటిని నిర్మించుకున్న సమయంలో సరిహద్దుదారుడైన తంగెళ్ల శ్రీనివాస్‌తో వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు, (శి వాజీ రాజు), మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు ఇరువురికి సర్దిచెప్పారు. దీనిపై మీడియా ఛానల్ అధినేతగా చెప్పుకుంటున్న సంకెళ్ల రాంబాబు సోషల్ మీడియాలో పాపారావుకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారు. దీంతో గ్రామస్తులంతా గ్రామ సభ ఏర్పాటు చేసి ఇటీవల జిల్లా ఎస్‌పి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఇదిలా ఉండగానే దుర్గ పరిధిలో ఉన్న దళిత నేత గోడి పెద్దిరాజు, మాజీ సర్పంచి పాపారావుపై మరోసారి పరువు మర్యాదలకు భంగం వాటిల్లేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ నేపథ్యంలో గొరగనమూడి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమస్యను పార్టీలకు అతీతంగా అందరు నేతలకు, కులసంఘాల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండలం నలుమూలల నుంచి రాజకీయ పార్టీల నేతలు, కుల సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో తరలొచ్చి ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని 144 సెక్షన్, 30 అమల్లో ఉందని ఎటువంటి ఆందోళనా చేయడానికి వీల్లేదని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామంలో వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తామంటూ గ్రామస్తులు ముత్యాలమ్మ మహంకాళమ్మ గుడి వద్ద నుంచి చినపేట, కొత్త కాలనీ పెదపేట మీదుగా జాతీయ రహదారి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్ద మన్నె మహంకాళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచి శివాజీరాజు మాట్లాడారు. గ్రామంలో అంతా సోదరభావంతో జీవిస్తున్నామని, సంఘ విద్రోహకశక్తుల వల్ల గ్రామంలో విభేదాలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా అంటే తమకు ఎంతో గౌరవం అని, రాంబాబు వంటి వారిపై మీడియా సంస్థలు కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచి పాపారావు మాట్లాడుతూ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగేలా అసభ్యకరమైన పోస్టులు పెట్టిన రాంబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సంకెళ్ల రాంబాబు వంటి ఫేక్ విలేకరుల వల్ల వ్యవస్థకే చెడ్డ పేరు వస్తుందన్నారు. పివి రావు మాలమహానాడు రాష్ట్ర నేత పొన్నమండ బాలకృష్ణ, మాదిగ సంఘం జాతీయ నేత తెన్నేటి కిషోర్, గరగపర్రు ఆత్మగౌరవ ఉద్యమ నాయకులు సిరింగుల వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ రాజా స్వర్ణలత, గ్రామ పెద్దలు ఇంజేటి వెంకటేశ్వర్లు, దళిత ముఖ్య నేత దుండి అశోక్ బాబు మాట్లాడుతూ గ్రామస్తుల మధ్య చిచ్చు పెడుతున్న రాంబాబు, దుర్గపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరువురిని జిల్లా బహిష్కరణ చేసి, పీడీ యాక్ట్ నమోదు చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్‌కు సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. చర్యలు చేపడతామని డిఎస్‌పి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, శృంగవృక్షం, వేంద్ర సర్పంచులు జంగం సూరిబాబు, కడలి నాగేశ్వరి, మాజీ ఎంపిపి పాలా వెంకట చలపతి, ఉప సర్పంచి గూడూరి రామాంజనేయులు, వైస్ ఎంపిపి నరేష్, జానకి, పరమేశ్వరరావు, కలిదిండి కృష్ణంరాజు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

గొరగనమూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

రైతు సంక్షేమానికి పెద్దపీట

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం యండగండి గ్రామంలో రైతులకు గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అధ్యక్షతన ఇద్దరు వరి రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పివిఎల్ నరసింహరాజు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రైతుల సౌకర్యార్థం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకూ అన్ని ఏర్పాట్లూ రైతు భరోసా కేంద్రాల నుంచే అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీలో అందించే యంత్ర పరికరాలను, పురుగుమందులు ఎరువులు తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు టి.గోపాలకృష్ణ, వేగేశ్న వేణు, ఎం.రామరాజు, హరిబాబు పాల్గొన్నారు.

రైతులకు పవర్ టిల్లర్లు అందజేస్తున్న పివిఎల్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ఏపి బహుజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసఫ్

ప్రజాశక్తి – కాళ్ల

అంబేద్కర్ ఆశయ సాధనకు తమ వంతు కృషి చేస్తున్నామని ఏపి బహుజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసఫ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ అంబేద్కర్ సామాన్య కుటుంబంలో పుట్టి స్వయంకృషితో మహోన్నత వ్యక్తిగా ఖ్యాతి గాంచారన్నారు. అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, విద్యార్థి దశ నుంచి దళిత ఉద్యమంలో పాల్గొని 1984లో ఏలూరుపాడులో అంబేద్కర్ ఆశాజ్యోతి యోజన సంఘాన్ని స్థాపించామన్నారు. పది మందితో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి అంబేద్కర్ విగ్రహాన్ని 1984లో ఏర్పాటు చేశామన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీలకతీతంగా దళిత ప్రాంతాల్లో దళితులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తున్నామన్నారు. భీమవరంలో పేద విద్యార్థుల కోసం అంబేద్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ నిధులు కేటాయించేవారన్నారు. అప్పటి ఎంపీ చేగొండి హరి రామ జోగయ్య హయాంలో ఏలూరుపాడు పెద్దపేటలో అంబేద్కర్ కమ్యూనిటీ భవనం నిర్మించామన్నారు. అంబేద్కర్ భవనంలో సచివాలయం-2 పాలన కొనసాగుతోందన్నారు. అంబేద్కర్ కమ్యూనిటీ భవనాలు లేని దళిత ప్రాంతాల్లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు కేటాయించి ఆ ప్రాంతంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు పునరుద్ధరించాలని కోరారు.

రాజ్యాంగ ఫలాలు అందించడంలో వివక్ష

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజన సమాఖ్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య

ప్రజాశక్తి – కాళ్ల

భారత రాజ్యాంగ ఫలాలను దళిత బహుజన మైనార్టీ వర్గాలకు అందించడంలో పాలక ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజన సమాఖ్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపడమే ధ్యేయంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంబేద్కర్ దయవల్ల నేడు దళిత వర్గాలు కనీసం ఈ స్థితిలో ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్లకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. రాజ్యాంగ మౌలిక విలువలను కాపాడుకోవాల్సిన పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో దళిత బహుజనులు పోగొట్టుకున్న రాజ్యాంగ బద్ధమైన 27 ముఖ్య పథకాలను రద్దు చేయడం బాధాకరమన్నారు. దళిత బహుజన వర్గాలైన ఎస్‌సి, బిసిలకు 60 ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఈ కార్పొరేషన్ ద్వారా కనీసం ఒక్క అభివృద్ధిలోనూ నిధులు మంజూరు చేయడంలేదని దారుణమన్నారు. ఏటా గత ప్రభుత్వ హయాంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ వేల కోట్లు బడ్జెట్లో కేటాయించేవారని, వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు పేరుతో వీటికి రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులు నవరత్నాలకు మళ్లించడం బాధాకరమన్నారు. అంబేద్కర్ పేరుతో ఉన్న విదేశీ విద్యా విధానాన్ని ఈ ప్రభుత్వం రద్దు చేసి, అంబేద్కర్ పేరును తొలగించి జగనన్న పేరుతో విదేశీ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాలను చేపట్టలేని స్థితిలో ఉందన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

దళితుల కోసం నిరంతరం కృషి

మాల మహానాడు ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురుపాటి రాజేష్

ప్రజాశక్తి – ఉండి

దళితుల కోసం మాల మహానాడు నిరంతరం కృషి చేస్తోందని మాల మహానాడు ఉండి నియోజకవర్గ అధ్యక్షులు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిగురుపాటి రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ దళితవాడలో అభివృద్ధి శూన్యమన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ ప్రోత్సాహంతో ఉండి నియోజకవర్గంలోని దళితుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని, శ్మశానవాటికలను బాగు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

శిరగాలపల్లిలో 'జగనన్నే మా భవిష్యత్తు'

యలమంచిలి:మండలంలోని శిరగాలపల్లి గ్రామంలో గురువారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొని గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి, గ్రామ అధ్యక్షులు వీరవల్లి నరసింహమూర్తి, సజ్జ శ్రీనివాస్, నాగలక్ష్మి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MELVIN JOE NARAYANA, S/o Mekala Lakshmi Narayana have changed my name from MELVIN JOE NARAYANA to MEKALA MELVIN JOE NARAYANA residing at 2/139 SDA Colony Pakka Banglow Road, Near Giffard Memorial Hospital, Nuzvid, vide affidavit dated 15/07/2022 Sworn before Notary Pamarthi Nagaraju Gollapalli, Nuzvid, Andhra Pradesh.

వికలాంగులకు బస్సు, రైల్వే పాసులు

ప్రజాశక్తి – పెనుమంట్ర

వికలాంగులకు ఎంపిపి సహకారంతో బస్సు, రైల్వే పాసులు ఇస్తున్నట్లు ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో వికలాంగులకు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) 50 శాతం రాయితీతో బస్సు, రైల్వే పాసుల దరఖాస్తులను రవాణా శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల పరిధిలోని వికలాంగులకు మూడు సంవత్సరాల కాల పరిమితితో పాసులు అందించడం జరుగుతుందన్నారు. బస్సుకు రూ.100, రైల్వేకు రూ.200 చొప్పున దరఖాస్తుకు చెల్లించాల్సి ఉందన్నారు. మండల పరిధిలో దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికీ ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) సహకారంతో వాసు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పాసులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాటెక్ వంటి వాటికి ఉపయోగపడతాయన్నారు. ప్రతి సచివాలయంలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకొల్లు సిహెచ్‌సి కెజిసిఎస్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ కె.వెంకటాద్రి, రాజోలు ఆర్‌టిసి ఎస్.సత్తిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : వికలాంగుల అభ్యున్నతికి శ్రీనివాస్ చేస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. హెలెన్ ఆడమ్ కెల్లర్ వికలాంగుల మండల అధ్యక్షుడు చిక్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయం వద్ద బస్, రైల్వే పాసుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, బాపన్న, రత్నరాజు, శేషు, జి.రామకుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గణపవరం:ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన ముందుంటుందని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం వల్లూరులో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన నిస్వార్థంగా పనిచేస్తుందన్నారు. సమస్యను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని స్థానికలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తోట పవన్, వీర మహిళలు అంబటి మాధవి, నిమ్మల మౌనిక పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో అంబేద్కర్ జయంతి

పాలకొల్లు:స్థానిక జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో అంబేద్కర్ జయంతిని హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చదువుకునే సమయంలో, ఉద్యోగ జీవిత సమయంలో అనేక అవమానాలను ఎదుర్కొన్నారన్నారు. అంటరానితనాన్ని రూపు మాపడానికి అనేక సభల్లో ప్రసంగించారని, రాజ్యాంగ ముసాయిదా సంఘానికి అధ్యక్షుడు అయ్యారని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని శశికళ, చల్లా ముత్యం పాల్గొన్నారు

స్థానిక ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సుబ్బలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు. అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి టి.కృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ అంబేద్కర్ వలే ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్, పార్థసారధి, డాక్టర్ విజయలక్ష్మి, మన్మథరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సైన్స్ పరీక్ష

పెనుమంట్ర:పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం సైన్స్ పరీక్ష నిర్వహించినట్లు ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న తెలిపారు. పొలమూరులో 110 మందికి 12 మంది గైర్హాజరు కాగా, పెనుమంట్ర హైస్కూల్లో 227 విద్యార్థులకు 10, మార్టేరు ఎస్విజిహెచ్ హైస్కూల్‌లో 154 మందికి ఐదుగురు విద్యార్థులు, మార్టేరు బసంతి దేవి బాలికల హైస్కూల్లో 146 మందికి ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీంగ్ జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పాలకోడేరు :కొండేపూడి పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంటిరాజు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం, మండల పరిషత్ నిధులు కలిపి రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రామచంద్రాపురంలో దాదాపు రోడ్డు నిర్మాణం పూర్తయ్యిందని మిగిలిన రోడ్ల నిర్మాణం చేయనున్నామని చెప్పారు. ముఖ్యంగా మండలంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి చింతపల్లి చిన్న వెంకట సత్యనారాయణ (చిన్న), మాజీ సర్పంచి బి.రాంబాబు, పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.మురళి గంగాధర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేత

పోడూరు:మట్టపర్రులో 17 మంది లబ్ధిదారులకు జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఇళ్ల పట్టాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గణపతిరాజు, వైస్ ఎంపిపి జి. సత్యనారాయణ, డిటిడిసి బాబు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.పెద్దిరాజు పాల్గొన్నారు.

అసమానతలు తొలగించడంపై దృష్టి పెట్టాలి

గణపవరం:దేశంలో పెరుగుతున్న ఆర్థిక సాంఘిక అసమానతలు తొలగించడంపై యువత దృష్టి పెట్టాలని కేరళ విశ్రాంత ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం గణపవరం డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన సామాజిక అంశాల అధ్యయనం, ఆచరణ అనే అంశాలపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఒక శాతంగా ఉన్న సంపన్నుల చేతిలో 43 శాతం సంపద పోగుపడి ఉందన్నారు. దేశంలో 70 మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలను అధ్యయనం చేయాలని సూచించారు. సమావేశంలో దారి దీపం సంపాదకులు డివివిఎస్ వర్మ, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందరం, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : వ్యకాస

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ఉపాధి పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మజ్జిగ తదితర సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలోని ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండుటెండలో పనిచేస్తున్నామని, తెచ్చుకున్న నీరు అయిపోయి ఇబ్బందులు పడుతున్నామని, ఉపాధి హామీ ప్రారంభంలో ఉన్న సౌకర్యాలన్నీ తీసేసి కూలీలకు అన్యాయం జరిగిందని కూలీలు వాపోయారు. టెంట్, తాగునీటి సౌకర్యం లేదని తెలిపారు. ఆన్‌లైన్ మస్టర్ విధానంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిరసన వ్యక్తం చేశారు. కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మండుటెండలో పనిచేస్తున్న కూలీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, రద్దుచేసిన సమ్మర్ అలవెన్స్ మౌలిక సదుపాయాలన్నీ వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కండెల్లి బాబూరావు, అలమండ కోటయ్య, డి.భాస్కరరావు, మోర్స వెంకట్రావు, లంక రమణ, దేవతల జయలక్ష్మి, మోర్స గంగా, చింతాడ మా లక్ష్మి, అలమండ సూరమ్మ, కండెల్లి ఎస్సిక పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి

జగన్ చిత్రపటంపై మద్యం పోసి దగ్ధం

ప్రజాశక్తి – ఉండి

మద్యపాన నిషేధం హామీతో 2019 ఎన్నికల్లో మహిళల ఓట్లు కొల్లగొట్టిన జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ విమర్శించారు. గురువారం రూత్ కళ ఆధ్వర్యంలో మహిళలు గణపవరం రోడ్డులోని బ్రాందీ షాపు వద్ద నిరసన తెలిపారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మద్యం అభిషేకం చేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి, రూత్ కళ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని ఎప్పుడు అమలు చేస్తావని ప్రశ్నించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చామని పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. గతేడాది కల్తీ మద్యం తాగి జంగారెడ్డిగూడెంలో సుమారు 18 మంది మృత్యువాత పడ్డారని వారికి ఇచ్చిన హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. టిడిపి హయాంలో 50 రూపాయలు ఉండే చీప్ లిక్కర్ సుమారు 150 రూపాయలకు పెంచేసి మద్యం సేవించే నిరుపేద ఆదాయానికి గండి కొట్టారన్నారు. 2024 ఎన్నికల్లో మహిళలు వైసిపికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు వత్సవాయి నాగ సుజాత, వేగేశ్న అనంతలక్ష్మి, పెద్దింటి నాగలక్ష్మి, కునుకు రమాదేవి, నేతల బేబీ, బచ్చు సరళ కుమారి, అండలూరి జయలక్ష్మి, తిరుమాని శశిదేవి, బొర్రా సుజాత, వీరవల్లి వెంకటలక్ష్మి, కాలువ లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు కాగిత బుజ్జి, జుత్తిగ శ్రీనివాస్, జి.సత్యనారాయణ, చెన్నంశెట్టి హరి నాయుడు, పాలపర్తి బాలాజీ పాల్గొన్నారు.

జగన్ పోస్టర్లకు మద్యం వేసి దగ్ధం చేస్తున్న టిడిపి మహిళా నేతలు

11 మంది డిఎస్‌సి 98 క్వాలిఫైడ్ టీచర్లకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి – పోడూరు

1998 డిఎస్‌సి ఉపాధ్యాయులుగా అర్హత సాధించిన 11 మందికి గురువారం ఎంఇఒ ఎఎస్ కెవి.ప్రేమజ్యోతి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సక్రమంగా నిర్వహించి విద్యా ప్రమాణాలు పెంపొందించే విధంగా విద్యాబోధన చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి – తణుకురూరల్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 13వ తేదీ శనివారం తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తణుకు ఇన్‌ఛార్జి 4వ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

జనసేన కార్యకర్తకు నేతల సాయం

ప్రజాశక్తి– తణుకు

పట్టణంలోని సజ్జాపురానికి చెందిన జనసేన కార్యకర్త గూటి ఆనందకుమార్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆయనను పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు కలిసి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జాపురం జనసేన కార్యకర్తలు, విడివాడ కలిసి 30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు 'తోటబడి'

ప్రజాశక్తి – మొగల్తూరు

రావులపాలెం గ్రామంలో గురువారం మామిడి రైతులకు తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్ మామిడి తోటల సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మామిడి తోటల్లో పట్టు తేనెమంచి పురుగు, తామర పురుగు, కాయ పగుళ్ల తదితర వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బి.ఎలీషా, కె.ప్రియదర్శిని ఎడిఎ అనిల్ కుమారి, డాక్టర్ ఎం.మల్లికార్జునరావు, డాక్టర్ ఎ.రాజేష్ పాల్గొన్నారు.

గూడెంలో చలివేంద్రం

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం బేబీ సెంటర్ రోడ్డులో మానస ప్రింటర్స్ పిటి వెంకన్న ఆధ్వర్యంలో గురువారం ఉదయం బుద్దాల వెంకట రామారావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కృష్ణవల్లభ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ చలివేంద్రంలో కూలింగ్ వాటర్‌తో అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్నను అందరూ అభినందించారు. కార్యక్రమంలో పైలు శ్రీనివాస్, పండు, ప్రముఖ ఆర్థోవైద్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం యాగరపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు కేశవ భట్ల విజయ్ మాట్లాడుతూ కుల వివక్షతను రూపుమాపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి నరసింహమూర్తి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిన్న, పెంటపాడు మండల అధ్యక్షులు కాజులూరు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి – యలమంచిలి

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14వ తేదీ శుక్రవారం చించినాడలో సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి కామేటి బాలరాజు తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, దళితుల హక్కులు, రక్షణ కోసం జరిగే పాదయాత్రను సభ్యులు సానుభూతిపరులు, మహిళలు యువకులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి – పోడూరు

మండలంలోని కవిటం, గుమ్మలూరు గ్రామాల్లో గురువారం డ్వాక్రా మహిళలకు వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత చెక్కులను జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, ఎఎంసి ఛైర్మన్ సికిలే లావణ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, అల్లూరి తిమ్మరాజు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ పడాల వెంకట సత్యనారాయణ రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి– తణుకు

హామీల అమల్లో వైసిపి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని 3, 4, ఏడు వార్డుల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన మహిళలు అనేక సమస్యలతో సతమతమౌవుతున్నారని తెలిపారు. 95 శాతం సంక్షేమ పథకాలు అమలు చేశామని అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే కాలంలో వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో గుబ్బల శ్రీనివాస్ రామాయణం దుర్గారావు, లంకసాని నారాయణమూర్తి, జక్కం శెట్టి వెంకటేష్, పంపన పద్మారావు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.A. 48/2022; E.A. 49/2022; E.P. 117/2022; O.S. 75/2021

Between:

కాదా నాగేంద్రబాబు ...DHr

మరియు

పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు (Died) వగైరాలు ...JDrs

To,

R2 : పెద్దిరెడ్డి పద్మావతి, W/o. (లేటు) పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు హిందూ, వయస్సు 48 సం॥లు, డో.నెం. C3-71, Y.S.R. నగర్, రామలక్ష్మి బ్రిక్స్ కంపెనీ దగ్గర, పెదవేగి గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా, ఏలూరు JCJC.

R3 : పెద్దిరెడ్డి రాజ్యలక్ష్మి, D/o. (లేటు) పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు హిందూ, వయస్సు 30 సం॥లు, డో.నెం. C3-71, Y.S.R. నగర్, రామలక్ష్మి బ్రిక్స్ కంపెనీ దగ్గర, పెదవేగి గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా, ఏలూరు JCJC.

R4 : పెద్దిరెడ్డి దీపిక, D/o. (లేటు) పెద్దిరెడ్డి వీరవెంకట సత్య కనక మాణిక్యాలరావు హిందూ, వయస్సు 26 సం॥లు, డో.నెం. C3-71, Y.S.R. నగర్, రామలక్ష్మి బ్రిక్స్ కంపెనీ దగ్గర, పెదవేగి గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా, ఏలూరు JCJC.

పై నెంబరు E.P. No. 117/2022 in O.S. No. 75/2021 గ్రంథములో మరియు సదరు E.P.తో దాఖలు చేసినటువంటి E.A. No. 48/2022 మరియు E.A. No. 49/2022 పిటీషన్లులలో పై రెస్పాండెంట్లకి శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు పై రెస్పాండెంట్లకి నోటీసును పేపరు ప్రకటన ద్వారా జారీ చేసి వాయిదాను **ది. 24-04-2023 తేదీనకు** రెస్పాండెంట్లు హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా రోజున పై రెస్పాండెంట్లు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి యెదుట **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలను శ్రీ కోర్టువారికి తెల్పుకోవలెను. లేని యెడల సదరు E.P. No. 117/2022 in O.S. No. 75/2021 పిటీషన్ను మరియు అందులో దాఖలు చేసినటువంటి E.A. No. 48/2022, E.A. No. 49/2022 పిటీషనర్లను మీ పరోక్షమందు విచారించబడును.

(శ్రీ కోర్టువారి అనుమతితో)

బి. తారకేశ్వరరావు
అడ్వకేట్, రామచంద్రపురం.
సెల్: 88979 31119

రామచంద్రపురం.
ది.12-4-2023

నేరాలు – ఘోరాలు

చెక్ బౌన్స్ కేసులో ముగ్గురికి జైలు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

చెక్ బౌన్స్ కేసులో ముద్దాయిలు పచ్చమట్ల వెంకటలక్ష్మి, నర్సాయమ్మ, ఉమాదేవిపై నేరం రుజువు కావడంతో వారికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.రమ్య గురువారం తీర్పు నిచ్చారు. ఫిర్యాదుదారుకు రూ. రెండు లక్షల పరిహారం చెల్లించాలని, లేకుంటే మరో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆమె తీర్పు నిచ్చారు.

50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి – పెనుమంట్ర

రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎస్‌ఆర్‌ఐ వి.పోతురాజు తెలిపారు. గురువారం తెల్లవారుజామున బ్రాహ్మణ చెరువు వై సెంటర్‌లో అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ వీరవాసరం మండలం చెందిన తోకలపూడి చెందిన కత్తుల సత్యబాబు కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చప్పళ్ల గ్రామానికి చెందిన ఉన్నమట్ల మణికంఠ 50 కేజీల బరువు కలిగిన 50 బస్తాలు బియ్యాన్ని కొనుగోలు చేశాడు. వాటి విలువ రూ.45 వేలు ఉంటుందన్నారు. ఈ బియ్యాన్ని పెనుమంట్ర ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించినట్లు చెప్పారు. అదేవిధంగా వ్యాన్ సీజ్ చేసి, డ్రైవర్ దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ, కానిస్టేబుల్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దపేటలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి – ఆచంట

ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పెద్దపేట గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో కొండేటి ముసలయ్యకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకూ ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు సిర్రా బాలాజీ 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే వైసిపి నాయకులు కొవ్వల సురేష్ రూ.5, వేల నగదు, భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బాలాజీ మాట్లాడుతూ ఆచంటలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని దశాబ్దాల కాలం నుంచి వేడుకుంటున్నా ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆచంటలో అగ్నిమాపకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కనపాల పెద్దిరాజు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, దుర్గారావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. No. 17/2022

పిటిషనర్: ముదునూరి లక్ష్మి గణపతి వర్మ

Vs

రెస్పాండెంట్: చేకూరి సతీష్ వర్మ మరియు 2 అదర్స్

పై నెంబరు క్రెడిటర్ ఐ.పిలో మొదటి రెస్పాండెంట్ అయిన చేకూరి సతీష్ వర్మ, తండ్రి: లక్ష్మీపతిరాజు, డోర్ నెంబరు 19-18-/3, కటారి నగర్, భీమవరం, భీమవరం మండలం అను వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిన తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు అనే కారణముగా ఈ కోర్టు వారు ది. 28-03-023 సం॥ము తేదీన ప్రజాశక్తి పేపరులో పబ్లికేషన్ ద్వారా మొదటి రెస్పాండెంట్‌కు నోటీసు అమలు చేయమని ఆదేశించడము అయినది.

కనుక ఈ కేసులో మొదటి రెస్పాండెంట్ అయిన చేకూరి సతీష్ వర్మ **ది. 27-04-2023 సం॥రం తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరు అయ్యి సదరు కేసులో ఆక్షేపణలు ఉన్న భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టుకి వచ్చి విన్నవించుకోవాలని యిందు మూలముగా తెలియజేయటము జరిగింది.

సి.జ్వాలా శ్రీనివాస్
పిటీషనర్ తరపు న్యాయవాది
భీమవరం, సెల్:9393939374

భీమవరం
12-04-2023

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు వారి కోర్టులో

ఓ.యస్. నెం. 698/2022

బిట్వీన్:

కొవ్వూరి శ్రీ లక్ష్మి –వాది

మరియు

కర్రి శ్రీరామకృష్ణారెడ్డి, తండ్రి: లేటు వెంకటరెడ్డి, డోర్ నెం. 3-93, నత్తారామేశ్వరం - 534 123, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధి –ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావా, వాది మీ నుంచి **రూ. 6,96,547/-లు** ఆరు ప్రామిశరీ నోట్ల బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు దావా సమన్లు అందుకొననందున, శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 02-05-2023 ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు ఎదుట హాజరు అవ్వని ఎడల మీ పరోక్షము నందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు
సెల్: 9390018122

తణుకు
ది.31-03-2023

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో

ఓ.యస్. నెం. 661/2022

బిట్వీన్:

పెన్మత్స వెంకట రామరాజు –వాది

మరియు

సలాది మురళీకృష్ణ –ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

ప్రతివాది: సలాది మురళీకృష్ణ, తండ్రి: లేటు అవతారం, వాటర్ సప్లయ్ టాంక్ వద్ద, మొఖాసా కల్వపూడి - 521345, మండవల్లి మండలం, లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా, ప్రాంశరీ నోటు బాకీ **రూ. 2,85,356/-లు** వసూలు నిమిత్తం మీ పై దాఖలు చేయగా, దావా సమన్లు అందుకొనక మీరు కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 26-04-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల మీ పరోక్షము నందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు
సెల్: 9390018122

తణుకు
ది.31-03-2023

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు వారి కోర్టులో

ఐ.ఏ. నెం. 699/2022 ఇన్ ఓ.యస్. నెం. 698/2022

బిట్వీన్:

కొవ్వూరి శ్రీ లక్ష్మి –పిటిషనర్/వాది

మరియు

కర్రి శ్రీరామకృష్ణారెడ్డి, తండ్రి: లేటు వెంకటరెడ్డి, డోర్ నెం. 3-93, నత్తారామేశ్వరం - 534 123, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధి –రెస్పాండెంట్/ప్రతివాది

పిటిషనర్/వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు పిటిషన్‌ను, మీ తాలూకా నత్తారామేశ్వరం, రి.స. నెం. 141/1 నందు ఎ.0-52 సెంట్లు భూమి అందులో కోళ్ళఫారం షెడ్లుతో సహా జడ్జిమెంట్ ముందే తోడజప్తు కోరుచూ వేయగా మీరు నోటీసులు అందుకొననందున, శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 02-05-2023 ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు ఎదుట హాజరు అవ్వని ఎడల మీ పరోక్షము నందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు
సెల్: 9390018122

తణుకు
ది.31-03-2023